క్విన్ సిటీస్ స్కామ్.. సేమ్ టు సేమ్

- కర్ణాటకలో కొత్త సిటీకి కాంగ్రెస్ శ్రీకారం
- 5,800 ఎకరాల విస్తీర్ణంలో నగర నిర్మాణం
- వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో ఫండింగ్ కోసమా?
- 'క్విన్' సిటీని పోలినట్టే 'ఫోర్త్' సిటీ నిర్మాణం

పక్కపక్కనే ఉండే రాష్ట్రాలవి.
దేశ జీడీపీలో వాటిదే అగ్రస్థానం.
రెండింట్లోనూ కాంగ్రెస్‌దే అధికారం.
ఇంకేముంది..?!
ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దల
కన్ను వీటిపై పడింది.
ఏ రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగినా ఇక్కడి నుంచే
సూటికేసులు రావాలి.
చిన్న ప్రాజెక్టులతో ముట్టేది కొంతే.. అందుకే
భారీ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు కావాలి.
అందుకే.. ఏకంగా కొత్త సిటీనే నిర్మిస్తే
అయిపోలా?? అనుకొన్నారు
పేరుకు పేరు.. డబ్బుకు డబ్బు..!
ఆలోచన వచ్చిందే తడువుగా.. తొలుత
అధికారంలోకి వచ్చిన కర్ణాటక సీఎంకు
మతలబు అందించారు.
అదే ఫార్ములాను తెలంగాణలోనూ అమలు
చేయమని ఇక్కడా ఆదేశించారు.
అధిష్ఠానం ఆదేశాలతో.. కర్ణాటకలో 'క్విన్'
సిటీకి, తెలంగాణలో 'ఫోర్త్' సిటీకి
అంకురార్పణ జరిగింది.
ఇక్కడ మరో గమ్మత్తైన విషయమేంటంటే..
రెండు సిటీలకు ఒకటే బ్లూప్రింట్..! అదీ
అధిష్ఠానం డైరెక్షన్‌లోనే..!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

బెంగళూరు, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): కర్ణాటక రాజధాని బెంగళూరు శివారుల్లో క్విన్ సిటీ (నాలెడ్జ్, వెల్‌బీయింగ్ అండ్ ఇన్నోవేషన్ సిటీ) పేరిట సిద్ధరామయ్య సర్కారు గురువారం కొత్త నగరానికి శ్రీకారం చుట్టింది. బెంగళూరుకు ఉత్తరదిశగా ఉన్న దొడ్డబల్లాపూర్ ప్రాంతాల్లో 5,800 ఎకరాల విస్తీర్ణంలో ఈ సిటీని నిర్మించనున్నారు. 'క్విన్ సిటీతో రాష్ట్రాభివృద్ధితో పాటు, పరిశ్రమలకు కావాల్సిన కొత్త పరిశోధనలకు ఊతం లభిస్తుంది. ఏఐ, బయోటెక్నాలజీ తదితర వినూత్న రంగాలు కొత్త పుంతలు తొక్కుతాయి' అని సీఎం సిద్ధరామయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. తొలి దశలో భాగంగా వచ్చే మూడేండ్లలో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో 2 వేల ఎకరాల్లో సిటీ నిర్మాణాన్ని చేపడుతామని చెప్పారు.



హైదరాబాద్‌లో శివారులో ప్రతిపాదిత ఫోర్త్ సిటీ.. కర్ణాటకలోని ప్రతిపాదిత క్విన్ సిటీ మధ్య పోలికలు

ఆ సిటీని రద్దు చేసి..

కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం క్విన్ సిటీ పేరిట పెద్దఎత్తున భూ పందేరానికి తెగబడుతున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వం ఇదే ప్రాంతంలో హెల్త్ సిటీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని రద్దు చేసినట్టు గుర్తు చేశారు. దీంతో 'హెల్త్ సిటీ' నిర్మాణ ప్రతిపాదనలు ఉన్న దబాస్‌పేట, దొడ్డబల్లాపూర్ తదితర ప్రాంతాల్లో భూముల విలువ అమాంతం పడిపోయిందని, ఇదే అదునుగా అధికార పార్టీ నేతలు చవగ్గా మెజారిటీ భూములను కొనుగోలు చేసినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇది జరిగిన ఆరునెలలకు మళ్లీ 'క్విన్' సిటీ పేరిట ప్రభుత్వం ప్రకటన వెలువరించిందని, దీంతో భూముల ధరలు అమాంతం పెరిగాయని మండిపడ్డారు. అంతిమంగా తామే నష్టపోయామని పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, గతంలో 'ఖిర్' సిటీ (నాలెడ్జ్, హెల్త్, ఇన్నోవేషన్, రీసెర్చ్ సిటీ) పేరిట ప్రతిపాదనలు ఉన్నమాట వాస్తవమేనని, అయితే, ఆ పేరునే తాము 'క్విన్' సిటీగా మార్చామని ప్రభుత్వవర్గాలు చెప్తున్నాయి.

ఒకేవిధంగా నిర్మాణాలు

బెంగళూరు శివారుల్లో నిర్మిస్తున్న 'క్విన్' సిటీని అనుకరిస్తూనే హైదరాబాద్ శివారుల్లో 'ఫోర్త్' సిటీ నిర్మాణ ప్రతిపాదనలు చేశారా? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. బెంగళూరు ప్రధాన నగరానికి 56 కిలోమీటర్ల దూరంలోని దొడ్డబల్లాపూర్ పరిసర ప్రాంతాల్లో క్విన్ సిటీని ప్రతిపాదించగా, హైదరాబాద్‌కు 57 కిలోమీటర్ల దూరంలో కందుకూరు సమీపంలో 'ఫోర్త్' సిటీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. బెంగళూరు నగరంలోని కెంపెగౌడ ఎయిర్‌పోర్ట్‌కు 'క్విన్' సిటీ 33 కిలోమీటర్ల దూరంలో ఉంటే, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు 'ఫోర్త్' సిటీ 37 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. 'క్విన్' సిటీకి మెట్రో, గ్రీన్‌ఫీల్డ్ రోడ్లను రవాణా సదుపాయాలుగా ప్రతిపాదించగా, 'ఫోర్త్' సిటీకి కూడా మెట్రో, గ్రీన్‌ఫీల్డ్ రోడ్లనే సెలెక్ట్ చేశారు. ఈ రెండు సిటీల్లోనూ ఏఐ వర్సిటీ కామన్‌గా ఉండటం గమనార్హం. 'క్విన్' సిటీ కోసం దబాస్‌పేట, దొడ్డబల్లాపూర్ మధ్య ఏర్పాటు చేయబోతున్న శాటిలైట్ ఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చినట్టే, హైదరాబాద్ చుట్టూరా నిర్మించతలపెట్టిన ఆర్ఆర్ఆర్ (రీజినల్ రింగ్ రోడ్డు) అలైన్‌మెంట్‌ను ఉద్దేశపూర్వకంగా పెంచారు. కర్ణాటకలో 'హెల్త్' సిటీని రద్దు చేసి 'క్విన్' సిటీని తీసుకొస్తున్నట్టే.. ఇక్కడ 'ఫార్మా' సిటీని రద్దు చేసి 'ఫోర్త్' సిటీని తీసుకొస్తున్నారు.

రెండు సిటీల్లోనూ పెద్ద స్కామ్

'క్విన్' సిటీ నిర్మాణం చేపడుతున్నామని కాంగ్రెస్‌కు చెందిన కొందరు నాయకులు దబాస్‌పేట, దొడ్డబల్లాపూర్ తదితర ప్రాంతాల్లో భూమాయాజాలానికి తెగబడుతున్నారు. రైతుల నుంచి అప్పటికే అగ్గువకు సొంతం చేసుకొన్న విలువైన భూముల్లో క్రయవిక్రయాలు, నిర్మాణాలు జరిపి వేలకోట్లు దండుకొంటున్నారు. ఇక, 'ఫోర్త్' సిటీ నిర్మాణం పేరిట హైదరాబాద్ శివారుల్లోని కందుకూరు, మచ్చర్ల, తుక్కుగూడ మొదలు యాచారం వరకూ వేల కోట్ల విలువైన భూదందా కొనసాగుతున్నది. 'ఫ్యూచర్' పేరిట ఇన్‌సైడ్ ట్రేడింగ్ నిత్యకృత్యంగా మారింది. ప్రతీ రోజూ కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయి.

కొత్త సిటీల నిర్మాణాలు ఎందుకు?

కొద్దిరోజుల్లో మహారాష్ట్ర, జార్ఖండ్, హర్యానా అసెంబ్లీలకు ఎన్నికలు జరుగనున్నాయి. వచ్చేఏడాది ఢిల్లీ, బీహార్‌లో, ఆ మరుసటి ఏడాది బెంగాల్, తమిళనాడు, కేరళ అసెంబ్లీలకు ఎన్నికలు జరుగనున్నాయి. అయితే, కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ మినహా మరేఇతర రాష్ట్రంలో సొంతంగా అధికారంలో లేదు. హిమాచల్ ఆర్థిక పరిస్థితి, రెవెన్యూ రాబడులు అంతంత మాత్రమే. దీంతో తలసరి ఆదాయంలో, పారిశ్రామిక ప్రగతి, జీఎస్డీపీలో స్వావలంబన సాధించిన తెలంగాణ, కర్ణాటకను కాంగ్రెస్ అధిష్ఠానం బంగారుబాతులుగా మార్చుకొన్నట్టు వాదనలు వినిపిస్తున్నాయి. చిన్న ప్రాజెక్టులతో పోలిస్తే, భారీ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులతో ఆర్థికలబ్ధి ఉంటుందని భావించిన ఢిల్లీ పెద్దలు.. తొలుత కర్ణాటకలో, ఆ తర్వాత తెలంగాణలో కొత్త సిటీల నిర్మాణానికి ఆదేశాలు ఇచ్చినట్టు తెలిసింది.

ఫోర్త్ సిటీ.. 'ఫ్యూచర్' ట్రేడింగ్!

అది ఉత్తరం.. ఇది దక్షిణం అందుకే!

బెంగళూరుకు 'క్విన్' సిటీ ఉత్తర దిశగా ఉన్నట్టే, హైదరాబాద్‌కు కూడా 'ఫోర్త్' సిటీని ఉత్తర దిశగానే నిర్మించాలని తొలుత ఢిల్లీ పెద్దలు రాష్ట్ర కాంగ్రెస్‌కు ఆదేశాలు ఇచ్చారట. హైదరాబాద్‌కు ఉత్తరాన కంటోన్మెంట్, హకీంపేట ప్రాంతాల్లోని మెజారిటీ భూములు రక్షణ శాఖ ఆధీనంలో ఉన్నట్టు రాష్ట్ర నాయకులు ఢిల్లీ పెద్దల దృష్టికి తీసుకెళ్లడంతో ఉత్తరాన కొత్త సిటీ ప్రతిపాదనను పక్కనబెట్టిన అధిష్ఠానం.. పశ్చిమాన ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, తూర్పున ఉప్పల్ పారిశ్రామికవాడ ఉండటంతో.. దక్షిణ భాగంలోని కందుకూరు, ముచ్చర్ల, తుక్కుగూడ ప్రాంతంలో 'ఫోర్త్' సిటీ కోసం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు భోగట్టా.

బ్లూప్రింట్ కాకపోతే మరేంటి?

- బెంగళూరు శివారుల్లో నిర్మిస్తున్న 'క్విన్' సిటీలో ఉండే వసతులు, నిర్మాణాలు.. హైదరాబాద్ శివారుల్లో నిర్మిస్తున్న 'ఫోర్త్' సిటీలోని వసతులు, నిర్మాణాలు ఒకేలా ఉన్నాయి. అదెలా?
- 'క్విన్' సిటీకి మెట్రో రైలు, గ్రీన్‌ఫీల్డ్ కనెక్టివిటీ ప్రతిపాదించినట్టే, ఫోర్త్ సిటీకి కూడా సరిగ్గా అలాగే.. మెట్రో రైలు, గ్రీన్‌ఫీల్డ్ కనెక్టివిటీ ఎలా ప్రతిపాదించారు?
- హెల్త్ సిటీని రద్దు చేసి 'క్విన్' సిటీని తీసుకొస్తున్నట్టే, 'ఫోర్త్' సిటీ కోసం ఫార్మా సిటీని రద్దు చేశారా?
- 'క్విన్' సిటీలో నాలెడ్జ్ వర్సిటీ, ఏఐ సిటీ నిర్మాణాలను ప్రతిపాదించినట్టే, 'ఫోర్త్' సిటీలో స్కిల్ వర్సిటీ, ఏఐ సిటీని అచ్చంఅలాగే ఎలా ప్రతిపాదించారు?
- 'క్విన్' సిటీ కోసం శాటిలైట్ ఆర్ఆర్ రూట్ మ్యాప్‌ను మార్చినట్టే.. 'ఫోర్త్' సిటీకి ఆర్ఆర్ఆర్ రూట్‌ను ఎందుకు మార్చారు?
- బెంగళూరులోని కెంపెగౌడ ఎయిర్‌పోర్ట్‌కు 'క్విన్' సిటీ ఎంత దూరంలో ఉన్నదో, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు కూడా 'ఫోర్త్' సిటీ అంతే దూరంలో ఉన్నది. ప్రధాన నగరాలకు కూడా ఈ రెండు కొత్త సిటీలు సమాన దూరాల్లో ఉన్నాయి. ఇది యాదృచ్ఛికమా?

ట్రిపుల్ ఆర్ కమిటీ సమావేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు కోసం ఆర్‌అండ్‌బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ నేతృత్వంలో ప్రభుత్వం నియమించిన కమిటీ గురువారం సచివాలయంలో మొదటిసారిగా సమావేశమైంది. ప్రభుత్వ సలహాదారు (ఇన్‌ఫ్రా) శ్రీనివాసరాజు, కమిటీ సభ్యులుగా ఉన్న ట్రిపుల్ ఆర్ ప్రాజక్టు పరిధిలోని ఏడు జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ శాఖల కార్యదర్శులు, ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ, చీఫ్ ఇంజినీర్ తదితరులు పాల్గొన్నారు. సీఎం సూచనలకు అనుగుణంగా ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ రూపకల్పనపై చర్చించారు. అలైన్‌మెంట్‌పై రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. కొందరి రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మారుస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అలైన్‌మెంట్‌ను ఖరారు చేసేందుకు 12మంది సభ్యులతో కమిటీ వేసింది.

ట్రిపుల్ ఆర్ గేమ్ చేంజర్

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 26(నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ప్రతిపాదిత రీజనల్ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) గేమ్ చేంజర్ వంటిదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. ట్రిపుల్ ఆర్‌తోపాటు టిమ్స్ దవాఖానలు, జిల్లాల్లో పరిపాలనా పరమైన భవనాల నిర్మాణం కొనసాగుతున్నదని చెప్పారు. కొత్త ఇంజినీర్లు తాము నిర్మించేవి రోడ్లో, భవనాలో అనుకోకుండా లక్షల మంది అవసరాలను తీర్చే కట్టడాలుగా భావించి పనిచేయాలని సూచించారు. గురువారం హైటెక్స్ ప్రాంగణంలోని న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్)లో టీజీపీఎస్సీ ద్వారా ఎంపికైన 156 మంది ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లకు శాఖపరమైన అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న 5 రోజుల ఒరియంటేషన్ కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి హాజరై ఇంజినీర్లకు మార్గనిర్దేశనం చేశారు. ఇంజినీర్ల రిక్రూట్‌మెంట్ ద్వారా ఆర్‌అండ్‌బీని పటిష్ఠం చేస్తున్నట్టు వివరించారు. తాను 24 గంటలు అందుబాటులో ఉంటానని, ఏదైనా సమస్య వస్తే తనతో చెప్పాలని ఇంజినీర్లకు సూచించారు. కొత్త ఇంజినీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకొని తమ కెరీర్లను నిర్మించుకోవాలని చెప్పారు.

ట్రిపుల్ ఆర్ నిర్వాసితుల ఆందోళన

- జంక్షన్ అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్

చౌటుప్పల్, సెప్టెంబర్ 26 : రీజినల్ రింగ్ రోడ్డు జంక్షన్ అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ ట్రిపుల్ ఆర్ బాధితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం చౌటుప్పల్‌లో భూ నిర్వాసితులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ ఆర్‌కు నాలుగు రహదారులను 40 కిలోమీటర్ల దూరంలో జంక్షన్లు ఏర్పాటు చేశారని, కానీ.. చౌటుప్పల్, భువనగిరి ప్రాంతాల్లో కేవలం 28 కిలోమీటర్ల దూరంలోనే నిర్మిస్తున్నారని మండిపడ్డారు. చౌటుప్పల్ జంక్షన్ ఏర్పాటు వల్ల మున్సిపాలిటీ రెండుగా విడిపోతుందని ఆవేదన చెందారు. దీనికితోడు ఏటా మూడు పంటలు పండే భూములు, హెచ్ఎండీఏ ప్లాట్లలోని ఇండ్లు కోల్పోతున్నట్టు ఆందోళన వ్యక్తం చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం తక్షణమే సవరణ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరసనలో సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, బండారు నర్సింహ, గుజ్జుల సురేందర్ రెడ్డి, దబ్బేటి రాములు గౌడ్, సందగళ్ల మల్లేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టుకు వర్కట్‌పల్లి ట్రిపుల్ ఆర్ బాధితులు

వలిగొండ, సెప్టెంబర్ 26 : తమకు న్యాయం చేయాలని కోరుతూ యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వర్కట్‌పల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని ట్రిపుల్ ఆర్ బాధితులు గురువారం హైకోర్టును ఆశ్రయించారు. ఈ సందర్భంగా రైతులు నాగెల్లి దశరథ, సోలిపురం జనార్దన్‌రెడ్డి, మెట్టు రవీందర్‌రెడ్డి, నాగెల్లి సత్యనారాయణ, మాడ్గుల వెంకటేశ్ తదితరులు మాట్లాడుతూ.. ట్రిపుల్ ఆర్ రోడ్డు నిర్మాణంలో చిన్న, సన్నకారు రైతులు, ఎకరం, రెండు, మూడు ఎకరాల భూములున్న రైతులే ఎక్కువ మంది ఉన్నారని, ఈ భూములను కోల్పోతే తమకు జీవనోపాధి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం మొదట నిర్ణయించిన అలైన్‌మెంట్ కాకుండా రెండో అలైన్‌మెంట్‌తోనే రైతుల భూములు ఎక్కువగా పోతున్నాయని పేర్కొన్నారు. మొదటి అలైన్‌మెంట్ ప్రకారం భూసేకరణ చేయాలని, రెండో అలైన్‌మెంట్ ప్రకారం భూసేకరణ చేస్తే మార్కెట్ ధరకు అనుగుణంగా నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని కొదురుపాక పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తదితరులు



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

ఫోర్త్ సిటీకి ఎకరమైనా సేకరించినవా?

- అన్న ఇంటికి నోటీసులు.. పేదలపైకి బుల్డోజర్లా?
- ఫార్మా భూములను బ్రదర్స్ కోసం, రియల్ ఎస్టేట్ కోసం వాడుతామంటే రైతులు తోలు తీస్తరు
- సమయానుకూలంగా అన్నింటినీ బయటపెడతం
- ఉప ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి: కేటీఆర్

> సిరిసిల్లను తిరుపూరుగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతోనే వస్త్ర ఉత్పత్తిదారులను స్టడీ టూర్‌కు బసుల్లో తమిళనాడు పంపించాం. ఆత్మహత్యలు, ఆకలి చావుల నుంచి బయటపడి ఇప్పుడిపుడే ముఖం తెలివికొస్తుందన్న సమయంలో దురదృష్టవశాత్తు దిక్కుమాలిన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. ఇక్కడి ప్రజలు నన్ను ఐదుసార్లు గెలిపించారన్న కోపంతో కాంగ్రెస్ ప్రభుత్వం నేతన్నలపై పగబట్టింది. బతుకమ్మ చీరల ఆర్డర్లు బంద్ చేసింది. మూతపడిన సాంచాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చి వేలాదిమంది కార్మికుల కడుపు నింపిన మహానుభావుడని కేసీఆర్. -కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ, ఏఐ సిటీ, జూపార్క్ అని మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి అందుకోసం ఒక్క ఎకరమైనా సేకరించారా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. గతంలో తమ ప్రభుత్వం ప్రతిపాదించిన భూమిని ఇతర అవసరాలకు ఎలా మళ్లిస్తారని ప్రశ్నించారు. బ్రదర్స్‌కు, రియల్ ఎస్టేట్‌కు వాడుతానంటే భూములిచ్చిన రైతులు ఊరుకోబోరని హెచ్చరించారు. ఫార్మాసిటీ విషయంలో ప్రభుత్వం అయోమయానికి గురిచేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇబ్రహీంపట్నంలో ఏ రైతులైతే ఓట్లేసి గెలిపించారో వాళ్లే కాంగ్రెస్ పార్టీ అంతు చూస్తారని హెచ్చరించారు. ఫార్మాసిటీ కోసం సేకరించిన 14 వేల ఎకరాల భూమి కండిషనల్ ల్యాండ్ అక్విజేషన్ అని తెలిపారు. ఆ భూములను రియల్ ఎస్టేట్ దందాల కోసం, ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ అనే హంగామా కోసం మళ్లించి వేలకోట్లు నొక్కెయ్యాలనే ఆలోచన, ప్రభుత్వం చేస్తున్న కుట్రలను న్యాయమూర్తులు గమనించాలని విజ్ఞప్తి చేశారు. సమయానుకూలంగా ఇందులో ఎవరెవరు జోక్యం చేసుకుంటున్నారో ఏమి జరుగుతున్నదో బయటపెడతామని చెప్పారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేటీఆర్ పర్యటించారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని పోలీస్ స్టేషన్ పక్కనున్న ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బోయినిపల్లి మండలంలోని కొదురుపాకలో తన అమ్మమ్మ, తాతయ్య జోగినిపల్లి లక్ష్మి-కేశవరావు జ్ఞాపకార్థం నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. తాను నాయకుడిగా రాలేదని, కేశవరావుకు మనవడిగా ఇక్కడకు వచ్చానని చెప్పారు. అనంతరం సిరిసిల్లకు చేరుకుని తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ మారినోళ్లంతా ఉప ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఉప ఎన్నికలు పక్కాగా వస్తాయని చెప్పారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న రాహుల్‌గాంధీ ప్రతిపక్ష నేత, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు కానీ, ఉద్యోగాల సంగతి మర్చిపోయారని విమర్శించారు.

కక్ష నాపై తీర్చుకోండి

ఈ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కక్ష తీర్చుకోదల్చుకుంటే తాను దానికి సిద్ధంగా ఉన్నానని కేటీఆర్ పేర్కొన్నారు. 'తొమ్మిదిన్నర నెలల నుంచి చూస్తున్నా. ప్రజలకు పనికొచ్చే ఒక్క పథకం తెచ్చారా? చెప్పిన డైలాగులేమో అనంతంగా చెప్పిండ్రు. వానకాలం నాట్లు పడ్డా ఇంతవరకు రైతు భరోసా దిక్కులేదు. రూ.10 వేలు కాదు, రూ.15 వేలు ఇస్తమన్నరు. రైతు రుణమాఫీ చెయ్యలేదు. క్షీరాభిషేకాలు అయిపోయాయి. ఊళ్లల్లోకెళ్తే కాంగ్రెసోళ్లను తన్నేటట్టున్నరు. ఎల్లకాలం మోసం నడవది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వ డ్రామాలు నడవవు. నేతన్న విషయంలో డ్రామాలు బంద్ పెట్టి చీరల తయారీ మొత్తం సిరిసిల్లకే ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు. 'బతుకమ్మ బంద్, క్రిస్మస్ దుస్తులు, రంజాన్ తోఫా ఎందుకు బంద్ పెట్టారో ఎవని అయ్యకు తెలువది. చెప్పేటోడు లేడు. అడిగేటోడు అంతకంటే లేడు' అని విమర్శించారు. ఇది దివాలాకోరు రాజకీయం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రోజుకొక్క పుకారు పుట్టించాలె. హెడ్‌లైన్ మేనేజ్‌మెంట్, డెడ్‌లైన్ మేనేజ్‌మెంట్.. అది తప్ప సర్కారు పీకిందేమీలేదు' అని ధ్వజమెత్తారు.

అన్న ఇంటికి నోటీసులు.. పేదల గుండెల్లో బుల్డోజర్లా

'అన్నకు 40 రోజుల నోటీసులిచ్చి వెసలుబాటు కల్పిస్తవ్. పేదల ఇండ్లను మాత్రం కూలుస్తవా' అంటూ రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఫైర్ అయ్యారు. దళితులు, మైనార్టీలు, బీసీలను బజారుకీడ్చి బుల్డోజర్‌తో తొక్కిస్తావా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఈ ప్రభుత్వంలో కుడి చేయి ఏం చేస్తుందో ఎడమ చేయికి తెలవడం లేదు. మూడు రోజుల కింద రిజిస్ట్రేషన్ అయినది, కోటిన్నర పెట్టి కొనుక్కున్న ఇంటిని కూల్చేస్తున్నారు. వీళ్లు ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారా? లేకుంటే సర్కస్ నడిపిస్తున్నారా? నీ ఖజానాకు ఓ చేయి నుంచి పైసలు తీసుకుంటవ్. ఇంకో చేత్తో కూలగొడవతారా? నీ అన్న ఇల్లు ముట్టనివ్వవు, అది భద్రంగా ఉండాలె. బడుగుల బతుకులు మాత్రం ఛిద్రం కావాలె. ఇదేనా? నీతి' అని విరుచుకుపడ్డారు. చిత్తశుద్ధి ఉంటే హైడ్రాలో ఇండ్లు కోల్పోయిన పేదలకు కేసీఆర్ కట్టించిన 40 వేల డబుల్ బెడ్రూం ఇండ్లను ఇవ్వాలని కోరారు. మూసీ నదిపై పెద్దపెద్ద బిల్డింగ్‌లు కడుతున్నారని, దమ్ముంటే వాటిని కూల్చాలని సవాల్ చేశారు. కేవీపీ రాంచందర్‌రావు, పట్నం మహేందర్‌రెడ్డిని విడిచి పెట్టి పేదలపై ప్రతాపం చూపడం న్యాయమా? అని నిలదీశారు. బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఇన్నోవేట్ థింకింగ్

ఇయ్యని ఉద్యోగాలను ఇచ్చినట్టు చెప్పుకుంటూ, నోటిఫికేషన్ ఇవ్వకున్నా 30 వేల ఉద్యోగాలు ఇచ్చానని ఊదరగొడుతూ, అర్హత లేని బావమరిదికి రూ.1,137 కోట్ల కాంట్రాక్టు ఇచ్చి ఇన్నోవేట్ థింకింగ్ అని ముఖ్యమంత్రి మాట్లాడుతున్నాడని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఇన్ని రోజులు అడ్రస్ లేని అన్నదమ్ములు రూ. వెయ్యి కోట్ల పెట్టుబడులతో మూటముల్లెతో వచ్చుడు ఇన్నోవిట్ థింకింగ్‌కు నిదర్శనమా? అని ప్రశ్నించారు.

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

'తెలంగాణ సాధన కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకం. తెలంగాణ సాయుధ పోరాటంలో నియంతృత్వాన్ని నిరసించి తెలంగాణకు స్ఫూర్తినిచ్చిన వీర వనిత ఐలమ్మను ఆడబిడ్డలందరూ ఆదర్శంగా తీసుకోవాలి' అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

> నేనే రాజు, నేనే మంత్రి, అక్కడ రేవంత్‌రెడ్డి, ఇక్కడ నేనే ప్రభుత్వాన్ని నడుపుతానంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కేకే మహేందర్‌రెడ్డికి అధికారులు వంత పాడుతున్నారు. అధికారులకు ఒకటే చెప్తున్నా. మొన్న ఆంధ్రప్రదేశ్‌లో ఆలిండియా సర్వీస్ ఆఫీసర్లు సైతం సస్పెండ్ అయ్యారు. చట్ట ప్రకారం కాకుండా ఇష్టం వచ్చినట్టు పని చేస్తమంటే మాత్రం తప్పకుండా దానికి ఫలితం అనుభవిస్తారు. ఎవరైనా సరే తప్పకుండా ఫలితం అనుభవిస్తారు. మూడున్నర, నాలుగేండ్లలో కేసీఆర్ తిరిగి వస్తారు. మీ సంగతి తప్పకుండా చూస్తారు. -కేటీఆర్

ఫార్మా సిటీ ఉందా.. లేదా?

మొదటిపేజీ తరువాయి...

విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలనే కాకుండా రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని కూడా మోసం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ ఫార్మాసిటీని రద్దు చేసి రైతులకు భూమిని తిరిగి ఇస్తామని హామీ ఇచ్చింది నిజం కాదా? అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఫార్మా సిటీని రద్దుచేస్తున్నామని, ఆ స్థానంలో ఫార్మా విలేజీలు, ఫార్మా క్లస్టర్లు ఏర్పాటుచేస్తామని అనేక వేదికలతో పాటు అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారని గుర్తు చేశారు. ఫార్మాసిటీ రద్దు విషయంలో మాయమాటలతో మభ్యపెట్టి, అనేక ఆర్థిక అవకతవకలకు, భూదందాలకు ప్రభుత్వం తెరలేపుతున్నదని విమర్శించారు. హైదరాబాద్ ఫార్మాసిటీ ప